అది ఒక కో—ఎడ్యుకేషన్ కాలేజి. అన్ని కాలేజీల్లోలాగే యిక్కడా ఆడపిల్లల్ని ఏడిపించడం వుంది. ఆ విషయంలో మిగతా కాలేజీలకన్నా యిది కాస్త ప్రగతి సాధించిందనే చెప్పాలి. మంత్రిగారి పుత్రరత్నం సురేష్ ఆ కాలేజి స్టూడెంటు కావడమే ఈ ప్రగతికి ముఖ్య కారణంగా పేర్కొనవచ్చు. అతనికి చాలా హాబీలున్నాయి. స్నేహితుల్ని వెంటేసుకుని వూరంట బలాదూర్‌గా తిరగడం, సినిమాలకి- హోటళ్ళకి పోవడం, ఆడపిల్లల్ని ఏడిపించడం వగైరా వగైరా. అయితే అతనికి అన్నిటికన్నా యిష్టమైన హాబీ ఆడపిల్లలకి "డాష్" యివ్వడం. ఇతని యీ హాబీ ఆడపిల్లలకి వదిలించుకోలేని శనిలాగ తయారయింది. అందుకనే యితను దూరాన కనబడగానే ఆడపిల్లలు తప్పుకుపోవడం నేర్చుకున్నారు. తనను చూడగానే అమ్మాయిలు బెదిరి, దూర దూరంగా తప్పుకుపోవడం సురేష్‌కి చాలా సరదాగా, థ్రిల్లింగ్‌గా అనిపించేది. ఒక రిద్దరు ధైర్యంకలిగిన అమ్మాయిలు ప్రిన్సిపాల్‌కి రిపోర్టు యిచ్చారు అయితే ఆయన వాళ్ళదే తప్పన్నట్లుగా ముఖంపెట్టి "ఏమిటమ్మా మీరు! మగపిల్లలతో సమానంగా అంటే ఎలా? తప్పుకుపోవడం నేర్చుకోవాలి. ఏది ఏమైనా అల్లరిపడేది మీరేకదా!" అని అరిటాకు ముల్లుకథని మొదలుపెట్టాడు పాపం! ఆయన మాత్రం ఏం చేస్తాడు! ఇక మూడు నాలుగేళ్ళలో రిటైరయిపోతాడు. ఇంకా పెళ్ళి చేయాల్సిన యిద్దరు కూతుళ్లున్నారు. ఏదో యిక్కడే యిల్లు కట్టి స్థిరపడ్డాడు. ఇప్పుడు సురేష్‌ని మందలించి మంత్రిగారి ఆగ్రహానికి గురైతే ఎక్కడికయినా ట్రాన్స్‌ఫర్ కావచ్చు. పెద్ద వయసులో ఆయన ఎక్కడని తంటాలు పడతాడు? ఇక ప్రిన్సిపాల్ సపోర్టు లభించదని, ఆయన "తప్పించుకు తిరిగే ధన్యుడని" అమ్మాయిలకి తెలిసిపోయింది. ఈ పీడ ఎప్పుడు విరగడవుతుందా అని ఎదు~ చూడ్డం తప్పిస్తే వాళ్ళేమీ చేయలేకపోయారు.

అప్పుడే ఆ కాలేజీలో చేరింది దీప్తి. వాళ్ళ నాన్నగారికి ఆ వూరు ట్రాన్స్‌ఫర్ కావడంతో. తెల్లటి తెలుపు లేకపోయినా తెలుపులో జమ చేయదగిన ఛాయతో విజ్ఞానం వుట్టిపడే పెద్ద పెద్ద కళ్ళతో అందంగా, హుందాగా వుంటుంది దీప్తి.

ఆ రోజు క్లాసుకి టైమ్ కావడంతో వెయిటింగ్‌రూమ్ నుంచి క్లాసుకి బయలుదేరారు అమ్మాయిలు. వాళ్ళందరికన్నా కొంచెం వెనకగా వస్తోంది దీప్తి. ఎక్కడనుంచి వచ్చాడో సురేష్. నేరుగా వచ్చి దీప్తికి డేష్ యిచ్చాడు. ఆమె చేతిలో పుస్తకాలు క్రిందపడిపోయాయి. నిర్ఘాంతపోయింది దీప్తి. అవమానంతో ఆమె ముఖం కందిపోయింది. నిశ్చేష్టయై నిలబడ్డ ఆమెను చూసి విలాసంగా నవ్వుతూ స్నేహితుల కేరింతల మధ్య విజయగర్వంతో నిష్క్రమించాడు సురేష్. క్రిందపడ్డ పుస్తకాలు తీసుకోవాలన్న ధ్యాస కూడా లేకుండా నిలబడిపోయిన దీప్తిని భుజం తట్టి పుస్తకాలు తీసి ఆమె చేతిలో పెట్టారు ఆమె క్లాస్‌మేట్స్. తేరుకున్న దీప్తి ప్రిన్సిపాల్‌కి రిపోర్టు యిస్తానని బయల్దుదేరింది. కానీ మిగతా ఆడపిల్లలు అసలు ఈ విషయంలో ప్రిన్సిపాల్ సహాయం ఏమాత్రం లభించదని విషయమంతా వివరించారు. పైగా "నువ్వు కొత్తకదా! నీకీ విషయం తెలియదు. మేముకూడా యిలాగే బాధపడుతున్నాం. అంతకుమించి ఏమి చేయగలం? ఇంట్లో చెబుదామా అంటే మన చదువులకే ముప్పు రావచ్చు" అని చెప్పారు.

ఆ రాత్రంతా ఆలోచించి ఒక నిశ్చయాని కొచ్చింది దీప్తి. మరునాడు కాలేజీలో అడుగుపెడుతూ చుట్టూ చూసింది. సురేష్ తన వందిమాగధులతో చెట్టుక్రింద నిలబడి వున్నాడు. దీప్తి నెమ్మదిగా, నిటారుగా నడవసాగింది. సురేష్ దీప్తిని చూశాడు. నిన్నటి అనుభవంతో తనని చూడగానే బెదిరి దూరంగా తప్పుకు పోతుందనుకున్న దీప్తి, తన కదేమి పట్టనట్టుగా సూటిగా నిర్భయంగా నడవసాగేసరికి అతని అహం దెబ్బ తిన్నట్లయింది. నిన్నటికన్నా గట్టిగా డాష్ యివ్వాలని విసురుగా వచ్చి, "డాష్ యిచ్చాడు. ఈసారి దీప్తి చేతిలో పుస్తకాలు క్రిందపడలేదు కాని సురేష్ నోటినుంచి "అమ్మా!" అనే కేక అప్రయత్నంగా వెలువడింది. దీప్తి పుస్తకాలతోపాటు ఒడుపుగా, నేర్పుగా పట్టుకున్న బ్లేడువల్ల అతని ఛాతీ కుడివైపు బాగా



గీరుకుపోయి విపరీతమైన మంట పుట్టసాగింది. "కరెక్టు! ఏ అమ్మాయిని చూసినా నీకు ముందుగా గుర్తురావాల్సింది "అమ్మ" అనే రెండక్షరాల పదం. నీకు జన్మయిచ్చిన తల్లికూడా ఆడదే అన్న విషయం మరచిపోవద్దు. ఏ ఆడపిల్లని అవమానించినా, నీ తల్లిని నువ్వు అవమానించినట్లే. నీకు నీ తల్లంటే ఏమాత్రం గౌరవం వున్నా యిక ఏ ఆడపిల్లని అవమానించడానికి ప్రయత్నించవు." ఇక చెప్పవలసిందేమీ లేనట్లు హుందాగా వెళ్ళిపోయింది దీప్తి.

స్వామి వివేకానంద శిలా విగ్రహం క్రింద చెక్కిన.

—"ఫియర్‌లెస్ నెస్ యీజ్ లైఫ్.

పీక్‌నెస్ యీజ్ డెత్" అన్న అక్షరాలు నీరెండలో తళుక్కున మెరిశాయి. ●